సాక్షి
వికారాబాద్

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023




భగీరథ అరకొర..
గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడు తున్నాయి. భగీరథ నీరు అరకొరగా సరఫరా చేస్తుండటమే ఇందుకు కారణం. 8లో▸



నకిలీ ఐస్‌క్రీమ్‌ల తయారీ
హానికర రసాయనాలతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న కేంద్రాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ దాడులు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. 8లో▸



దేశానికే ఆదర్శం
కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో▸



న్యూస్‌రీల్

బ్రిడ్జి పనుల్లో జాప్యం తగదు

- ఎంపీ రంజిత్‌రెడ్డి ఆదేశం
- మొరంగపల్లి వంతెనకు రూ.50 లక్షలు విడుదల



రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న రంజిత్‌రెడ్డి

మోమిన్‌పేట: రైల్వే అండర్ పాసు బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొరంగపల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ పాస్ వంతెనను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. పనులు నిలిచిపోవడంతో తాను సొంతంగా రూ.50 లక్షల నిధులు విడుదల చేశానని తెలిపారు. నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి సొంత డబ్బులు ఇచ్చామని స్పష్టంచేశారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులను పూర్తి చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. సీసీ రోడ్డు పనులు ఓ పక్క పూర్తి చేశారని, ఇంకో పక్క వెంటనే ప్రారంభించాలని సూచించారు. రైల్వే ట్రాక్ కింద నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలోనూ పనుల్లో జాప్యం జరగకూడదని తెలిపారు.

తట్టేపల్లి మండలం సాధించే వరకూ దీక్ష చేస్తాం



రిలే దీక్షలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్: తట్టేపల్లిని మండలముగా ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామని మండల సాధన కమిటీ సభ్యులు తేల్చిచెప్పారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలకు తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ లక్ష్మారెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నిరంగాల్లో వెనకబడిన తట్టేపల్లిని ప్రభుత్వం వెంటనే ప్రత్యేక మండలముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తట్టేపల్లి వాసులు ఏచిన్న పనికోసమైనా పెద్దేముల్ వెళ్లేందుకు సుమారు 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు శంకర్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్, మాజీ సర్పంచ్ గెమ్యానాయక్, ఉప సర్పంచ్ కిష్టప్ప, జగన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వాన్ని తప్పిస్తేనే అభివృద్ధి

చేవెళ్ల: రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని పక్కకు తప్పిస్తేనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 23న చేవెళ్లలో కేంద్ర మంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభా స్థలాన్ని మంగళవారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, సందానందరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ఎంత అభివృద్ధి చేసినా, ఎన్ని సంక్షేమ పథకాలు తెస్తున్నా కేసీఆర్ ప్రభుత్వం వాటిని ప్రజలకు చేరకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఎక్కడ కేంద్రానికి పేరు వస్తుందోనని ఎన్నో పథకాలను ప్రజలకు అందకుండా, తెలియకుండా చేస్తోందని దుయ్యబట్టారు. కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'ప్రవాస్ యోజన' పేరుతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే చేవెళ్లలో బహిరంగ సభకు నిర్ణయించినట్లు చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బహిరంగ సభ ఉంటుందని, అనంతరం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనాయకులతో అమిత్‌షా ప్రత్యేకంగా సమావేశమవుతారని ఆయన వెల్లడించారు.

'పట్టా'భిషేకమే..



పోడు పట్టాల ఏడాదిన్నర నిరీక్షణకు త్వరలోనే తెర పడనుంది. ఇందుకు సంబంధించిన అర్హుల లెక్క తేలింది. గ్రామాలు, మండలాలు, డివిజన్ల వారీగా జాబితా సిద్ధమైంది. వీరికి పంపిణీ చేసేందుకు పాసు పుస్తకాలు సైతం రెడీ అయ్యాయి. అధికారుల సంతకాలు పూర్తికావడంతో ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో కేవలం ఐదుశాతం మాత్రమే అర్హత సాధించాయి.

- పోడు రైతుల జాబితా సిద్ధం
- అర్హులు 5శాతమే!
- పంపిణీకి రెడీగా పాసుపుస్తకాలు
- ప్రభుత్వ ఆదేశాలు అందడమే తరువాయి



కుల్కచర్ల మండలంలో రైతులు సాగు చేసుకుంటున్న అటవీ భూమి

మొత్తం దరఖాస్తులు:	9,647
అర్హత సాధించిన రైతులు:	436
పంపిణీ చేయనున్న భూమి:	552 ఎకరాలు

వికారాబాద్: అటవీ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు ఎట్టకేలకు పట్టాలు అందనున్నాయి. దరఖాస్తుల పరిశీలన విషయంలో నేతల నుంచి ఒత్తిడి పెరగడంతోనే ప్రక్రియలో జాప్యం జరిగిందని తెలుస్తోంది. పట్టాల పంపిణీ కోసం సుమారు 18 నెలల క్రితం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. అటవీ సంరక్షణ కమిటీల ఆధ్వర్యంలో అభ్యర్థనలు స్వీకరించి, పరిశీలన పూర్తిచేశారు. అనేక అవాంతరాలు దాటిన తర్వాత ఎట్టకేలకు పట్టాల పంపిణీ కోసం ముహూర్తం చూస్తున్నారు.

నేతల ఒత్తిడి

లబ్ధిదారుల జాబితా తయారీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందనే అపోహలో రాజకీయ నేతల నుంచి అధికారులకు ఒత్తిడి పెరుగుతోంది. తమకు కావాల్సిన వారికి ఎలాగైనా పట్టాలు ఇప్పించాలనే పట్టుదలతో ప్రజాప్రతినిధులు, నాయకులు పావులు కదుపుతున్నారు. ఇందుకోసం పలు చోట్ల తాయిలాలను ఎర వేస్తున్నట్లు తెలుస్తోంది. అర్హుల ఎంపిక కమిటీలో జిల్లా మంత్రి, ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండటంతో సెలెక్షన్ విధానంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. పోడు హక్కులు కల్పించే ప్రక్రియ ద్వారా అటవీ ప్రాంతం తగ్గిపోకుండా ఉండేందుకు ఆశాఖ అధికారులు అవస్థలు పడుతున్నారు. ముందుగా 424 మందితో జాబితా తయారు చేయగా.. పలు గ్రామాల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని 436 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

శాశ్వత పరిష్కారం దిశగా..

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఆదిశగా కసరత్తు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఫారెస్ట్ భూములను సాగు చేసుకుంటున్న 126 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 133 పల్లెల్లో అటవీ సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఊహించని విధంగా 9,647 మంది రైతులు.. 21,761 ఎకరాల్లో అటవీ భూములను సేద్యం చేస్తున్నట్లు దరఖాస్తు చేసుకున్నారు. అటవీ సంరక్షణ చట్టంలో పొందుపర్చిన నిబంధనల ప్రకారం పోడు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులలో కేవలం ఐదు శాతం అప్లికేషన్లకు మాత్రమే ఆమోదం లభించింది.

గిరిజనేతరులకు నో చాన్స్

అటవీ సంరక్షణ నిబంధనల ప్రకారం 2005కి ముందు అటవీ ప్రాంతాల్లోని భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న రైతులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో 2006 సంవత్సరానికి 70 సంవత్సరాల ముందు నుంచే ఎవరైనా గిరిజనేతరులు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తూ ఉంటే వారిని కూడా లెక్కలోకి తీసుకుంటారు. కానీ 2006- 09 మధ్య కాలంలోనే అప్పటి వరకు కబ్జాలో ఉన్న సుమారు 672 మంది గిరిజనేతరులకు అప్పటి ప్రభుత్వం పోడు హక్కులు కల్పించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అంటే ప్రస్తుత పోడు హక్కుదారుల జాబితాలో గిరిజనేతరుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోలేదు.

పది మండలాల్లో లబ్ధిదారులు

పోడు హక్కుల కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,647 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 4,804 మంది గిరిజనేతరులు, 4,843 మంది గిరిజనులు ఉన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారిలో చాలా మంది గిరిజనులు మైనర్లుగా ఉండటంతో పాటు ఇతర కారణాలతో కేవలం 436 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. వీరికి 552 ఎకరాల భూమిని పంపిణీ చేయనున్నారు. ఓవరాల్‌గా 10 మండలాలకు సంబంధించిన లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో కుల్కచర్ల మండలంలో అత్యధికంగా 187 మంది, పరిగిలో 77 మంది అర్హత సాధించారు. అత్యల్పంగా పూడూరు, కొడంగల్‌లో ఆరుగురు చొప్పున, బషీరాబాద్‌లో ఏడుగురు ఎంపికయ్యారు.



ఎక్మాయిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన వేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ప్రతీ గ్రామానికి రూ.50 లక్షలు

- నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తా
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- 'పల్లెపల్లెకూ పైలెట్'లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బషీరాబాద్: 'ఒక్కో గ్రామానికి రూ.50 లక్షలు ఇచ్చిన ఎమ్మెల్యే రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారా..? నేను ఒక్కో ఊరికి రూ.50 లక్షలు ఇచ్చా.. ఇప్పుడు ఆ పనులకు శంకుస్థాపనలు చేస్తున్నా.. రాబోయే మూడునాలుగు నెలల్లో పనులన్నీ పూర్తి చేసి.. సమస్యలను పరిష్కరిస్తా' అని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నీళ్లపల్లి ఏకాంబరి ఆలయం నుంచి మంగళవారం 'పల్లెపల్లెకు పైలెట్' రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకాంబరి రామలింగేశ్వర ఆలయ అభివృద్ధి కోసం రూ.కోటి నిధులతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మైల్వార్‌తండా, మైల్వార్, కాంసాన్‌పల్లి, ఎక్మాయి, నంద్యానాయక్‌తండా, కొత్లాపూర్, వాల్యానాయక్‌తండా, దామర్‌చెడ్, జమ్లానాయక్‌తండా, అల్లాపూర్, ఇందర్‌చెడ్, నావంద్గి, గంగ్వార్, జీవన్గి గ్రామాల్లో రూ.50 లక్షల చొప్పున కేటాయించిన పనులకు శిలాఫలకాలు వేశారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ.. తాండూరు చరిత్రలోనే తొలిసారిగా నియోజకవర్గ అభివృద్ధికి రూ.134 కోట్ల నిధులు తెచ్చానన్నారు. గ్రామాల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

మైల్వార్‌లో ఉద్రిక్తత

మైల్వార్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బిచ్చిరెడ్డి గ్రామంలోని అంకలమ్మ చెరువు తూము పనులు ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. ఆయకట్టుకు సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నా పట్టించుకోరా..? అని నిలదీశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్ రాముునాయక్‌ను ఆదేశించారు. అయినా వినకుండా బిచ్చిరెడ్డి ఎదురు మాట్లాడటంతో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సదరు నాయకుడిని అదుపులోకి తీసుకుని కరన్‌కోట్ పీఎస్‌కు తరలించారు. కొంతమంది రైతులు బిచ్చిరెడ్డికి మద్దతుగా నిలిచారు. సమస్యలపై నిలదీసిన మహిళల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే వారిని సముదాయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామునాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీశైల్‌రెడ్డి, నర్సిరెడ్డి(రాజు), ఖాలిద్, గోపాల్‌రెడ్డి, సిఖిందర్ ఖాన్, పాండురంగారెడ్డి, నరేష్ చౌవాన్, హన్మంత్‌రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవ వైవిధ్యం

- సిటీ బయో డైవర్సిటీ ఇండెక్స్‌లో పైపైకి
- 36 నుంచి 57 పాయింట్లకు చేరిన స్కోర్
- పదేళ్లలో నగరంలో గణనీయమైన వృద్ధి
- ఇండెక్స్‌ను విడుదల చేసిన మంత్రి కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: నగర జీవవైవిధ్య సూచి (సిటీ బయో డైవర్సిటీ ఇండెక్స్)లో హైదరాబాద్ నగరం గణనీయమైన వృద్ధి సాధించింది. 2012లో ఇండెక్స్‌లో 36 పాయింట్ల స్కోర్‌తో ఉన్న నగరం తాజా ఇండెక్స్‌లో 57 పాయింట్ల స్కోర్ సాధించింది. ఇక్లీ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనిషియేటివ్స్) ద్వారా జీహెచ్‌ఎంసీ రూపొందించిన తాజా సిటీ బయోడైవర్సిటీ ఇండెక్స్‌ను మంగళవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ ఇండెక్స్‌లో నగరం పలు అంశాల్లో ఎంతో అభివృద్ధి సాధించినట్లు వెల్లడైంది. సరస్సుల నగరంగా పేరొందిన హైదరాబాద్ లో ప్రస్తుతం దాదాపు రెండు వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న 1350కి పైగా జల వనరులు, 1600 హెక్టార్లలో విస్తరించిన సహజ రాళ్లగుట్టలు , నగరంలో ఉన్న రెండు జాతీయ పార్కులు (కేబీఆర్, హరిణి వనస్థలి) జీవవైవిధ్యానికి ఎంతగానో దోహదం చేస్తున్నాయని నివేదికలో పేర్కొన్నారు. దీంతోపాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఇక్రిశాట్ వంటి సంస్థలకు ఉన్న సువిశాలమైన క్యాంపస్‌లు జీవవైవిధ్యానికి కేంద్రాలుగా ఉన్నాయని తేలింది.

ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతోనే: కేటీఆర్

నగరం కోసం ప్రత్యేకంగా బయో డైవర్సిటీ ఇండెక్స్ తయారు చేయించిన అధికారులను మంత్రి కేటీఆర్ అభినందించారు. ఒక నిజమైన ప్రపంచ స్థాయి నగరంగా మారే పరిణామ క్రమంలో జీవవైవిధ్యం అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ ఈ సందర్భంగా అన్నారు. జీవించు- జీవించనివ్వు అన్న స్ఫూర్తి ఆధారంగా నగరీకరణ జరిగినప్పుడే ప్రకృతితో మమేకమై బతకగలిగే పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత హారం, చెరువుల సంరక్షణ - బలోపేతం, అడవుల పెంపకం, అర్బన్ లంగ్ స్పేసెస్ వంటి కార్యక్రమాలు నగర జీవవైవిధ్యానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, భవిష్యత్తులోనూ నగరంతోపాటు, నగరం చుట్టుపక్కల కూడా జీవివైవిధ్యం మరింత పెరుగుతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్‌శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యర్థులకు సహకరిస్తున్నాడనే..

- డాక్యుమెంట్ రైటర్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- కొత్తూరు ఎంపీపీతో సహా ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ

శంషాబాద్: వ్యాపారంలో తన మాట వినకపోవడంతో పాటు ప్రత్యర్థులకు సహకరిస్తున్నాడన్న కారణంతోనే డాక్యుమెంట్ రైటర్‌ను హత్య చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కిడ్నాప్, హత్య కేసులో ప్రధాన నిందితుడు కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి మంగళవారం కేసు వివరాలు వెల్లడించారు. కొత్తూరు మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి (29)కి తహసీల్దార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా షాపు ఏర్పాటు చేసుకునేందుకు ఎంపీపీ సహకరించాడు. ఆ తర్వాత కొంతకాలానికి తన బంధువుకు అందులో భాగస్వామ్యం కల్పించాలని కోరగా కరుణాకర్‌రెడ్డి అందుకు నిరాకరించాడు. ఇటీవల మల్లాపూర్‌లోని ఓ భూ వివాదంలో ఎంపీపీకి ప్రత్యర్థిగా ఉన్న వ్యక్తితో కలిసి ఫెన్సింగ్‌ను తొలగించేందుకు కరుణాకర్‌రెడ్డి సహకరించాడు. దీంతో అతడిపై కక్ష పెంచుకున్న మధుసూదన్ రెడ్డి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

కిడ్నాప్ చేసి...

ఈ నెల 16న సాయంత్రం 5.30 గంటలకు కరుణాకర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి అతడి మామ రాంచంద్రారెడ్డిని మామిడిపల్లి గ్రామంలో దింపి మల్లాపూర్‌కు తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో తీగాపూర్ వద్ద ఎంపీపీ మధుసూదన్ రెడ్డితో పాటు పిన్నింటి విక్రమ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహ్మద్ అరిఫ్ పాషా, అరుణ్ కుమార్‌రెడ్డి స్కార్పియో వాహనంతో అటకాయించారు. కారు అద్దాలు పగులగొట్టి కరుణాకర్‌రెడ్డిని స్కార్పియో వాహనంలోకి ఎక్కించుకుని చేవెళ్ల రోడ్డువైపు వెళ్లారు. మొయినాబాద్ సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో కర్రలతో విచక్షణారహితంగా కరుణాకర్‌రెడ్డిపై దాడి చేశారు.

ఆస్పత్రికి తీసుకెళ్లి..

పూర్తిగా స్పృహ కోల్పోయిన కరుణాకర్‌రెడ్డిని విక్రమ్‌రెడ్డి, ఆరిఫ్, అరుణ్‌కుమార్ గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు చెప్పి ఆస్పత్రిలో చేర్చారు. పరీక్షించిన వైద్యులు అతడు మృతిచెందినట్లు ధ్రువీకరించేలోపే నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆస్పత్రి వైద్యులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటికే శ్రీధర్‌రెడ్డి ద్వారా కిడ్నాప్ ఫిర్యాదు అందుకున్న కొత్తూరు పోలీసులు కాంటినెంటల్‌లో ఉన్న మృతదేహం కరుణాకర్‌రెడ్డిదిగా గుర్తించి కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ సన్‌సిటీ ఏరియాలో ఉన్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మహ్మద్ ఆరిఫ్, అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన విష్ణువర్ధన్‌రెడ్డి పరారీలో ఉన్నాడు.

కరుణాకర్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

అఫ్జల్‌గంజ్: హత్యకు గురైన డాక్యుమెంట్ రైటర్ కరుణాకర్ రెడ్డి మృతదేహానికి మంగళవారం ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మార్చురీ వద్దకు చేరుకొని కరుణాకర్ రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని మృతుడి కుటుంబీకులకు హామీ ఇచ్చారు.

30 వరకు క్రమబద్ధీకరణ

- జీఓ నంబర్ 58, 59 అర్హులకు చివరి అవకాశం
- మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: కబ్జాలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించేందుకు అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 30 వరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీఓ నంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న వారికి చివరి అవకాశం కల్పించిందని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 125 చదరపు గజాలలోపు స్థలంలో ఉన్న వారు ఈనెల 30 వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి రుసుము లేకుండా, ఉచితంగా రెగ్యులరైజేషన్ చేస్తామని తెలిపారు. జీఓ నంబర్ 59 ప్రకారం 125 చదరపు గజాల కన్నా ఎక్కువ స్థలం ఆక్రమించిన వారు దరఖాస్తు చేసుకుంటే తగిన ఫీజు చెల్లించిన వారికి సైతం అవకాశం కల్పిస్తామని చెప్పారు. 2014 నుంచి జూన్ 2020 వరకు కాల పరిమితిని పెంచుతూ 2020 వరకు కబ్జాలో ఉన్న వారందరూ కూడా అర్హులేనని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.

సాఫ్ట్ కాపీలు అందజేయండి

ధరణి కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల్లో డిసెంబర్ 31- 2022 వరకు వచ్చిన జీఎల్‌ఎం, సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్ పనులన్నింటినీ ఈ నెల 30 వరకు పూర్తి చేయాలన్నారు.డబుల్ బెడ్‌రూమ్‌కు సంబంధించిన వెరిఫికేషన్ పనులు పూర్తి చేసి సాఫ్ట్ కాపీలు అందజేయాలని ఆదేశించారు.

సమష్టిగా పనిచేయాలి

ఇప్పటికే పురోగతిలో ఉన్న, ప్రారంభించాల్సిన సివిల్ పనులను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేసేలా అధికారులు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. 'మన ఊరు మనబడి' కింద రూ.30 లక్షల వ్యయం కన్నా తక్కువ ఉన్న పనులన్నింటినీ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. అంతకు ఎక్కువ వ్యయమున్న పనులను జూన్‌లోపు పూర్తిచేయాలని తెలిపారు. మే 31నాటికి అన్ని గ్రామాలు, పట్టణాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, వైకుంఠధామాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీఓలు, ఏపీఓలను ఆదేశించారు.

ముగిసిన భాగవత సప్తాహం

హుడాకాంప్లెక్స్: ఆధ్యాత్మిక పుస్తకం హస్త భూషణం అని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, హార్టీ, సెరీ కల్చర్ కమిషనర్ హన్మంతరావు అన్నారు. సరూర్‌నగర్ హుడాకాలనీలోని రామాలయంలో మంగళవారం దేవులపల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహం ఆధ్యాత్మిక ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆధ్మాత్మిక ప్రవచనకర్త శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య రచించిన ఆణిముత్యాలు, సుధాతరంగాలు పుస్తకాలను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌

ధారూరు: పిడుగుపాటుకు మృతి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే ఆనంద్‌ మంగళవారం రూ.2 లక్షల చెక్కు అందజేశారు. మండల పరిధిలోని నర్సాపూర్‌కు చెందిన ఎన్కెపల్లి మహేందర్‌ పిడుగుపాటుతో మృతి చెందాడు. బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రమాద బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి మృతుని భార్య, కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్‌, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థి

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



సిల్వర్‌ మెడల్‌ తీసుకుంటున్న విద్యార్థి కిరణ్‌

కొడంగల్‌ రూరల్‌ : హన్మకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కొడంగల్‌ విద్యార్థి సత్తా చాటాడు. పైగా వచ్చే నెలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యార్థి కిరణ్‌ తెలిపారు. పట్టణానికి చెందిన కటికె మహేష్‌ రెండో కుమారుడు కిరణ్‌ హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. హన్మకొండలో రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి కిరణ్‌ 15వందల మీటర్ల రన్నింగ్‌ పోటీల్లో 4ని.32 సెకన్లలో లక్ష్యాన్ని సాధిస్తూ సిల్వర్‌ మెడల్‌ దక్కించుకున్నాడు. గతంలోనూ పలు రన్నింగ్‌ రేస్‌లలో గోల్డ్‌ మెడల్స్‌ సాధించిన విద్యార్థి కిరణ్‌ను స్థానికులు అభినందిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి సత్తా చాటడం, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోచ్‌ సాయిరెడ్డికి విద్యార్థి కిరణ్‌ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నీటిగుంతలోకి దూసుకెళ్లిన లారీ

డ్రైవర్‌కు గాయాలు



గుంతలో బోల్తాపడిన లారీ

కొడంగల్‌ రూరల్‌ : లారీ నీటి గుంతలోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం తెల్లవారుజామున పట్టణశివారులో చోటుచేసుకొంది. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం నుంచి తాండూరు సమీపంలోని కోరమండల్‌ కింగ్‌ సిమెంట్‌ ఫ్యాక్టరీకి లారీ వస్తోంది. ఈ క్రమంలో డ్రైవర్‌ నిద్రమత్తులో ఉండగా పట్టణశివారులోని బాపల్లిరోడ్డు సమీపంలో లారీ గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌ అద్దాలు పగులగొట్టి బయటకు వచ్చారు. అదృష్టవశాత్తు డ్రైవర్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీలో దాదాపు రూ. 6 లక్షల విలువ చేసే క్లింకర్‌ ఉన్నట్లు డ్రైవర్‌ తెలిపారు.

బైక్‌ నుంచి కిందపడి వ్యక్తి మృతి

ధారూరు: వేగంగా వెళ్తున్న బైకిస్టు అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలకుగురై మృతి చెందాడు. ఎస్‌ఐ సంతోశ్‌కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన జగన్నాథ్‌ బిహారీ(34) స్థానికంగా ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 15న రాత్రి నాగసముందర్‌ సమీపంలోని ఫ్యాక్టరీలో కూలీ పని ముగించుకుని తిరిగి వస్తుండగా బైక్‌ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికితరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మంగళవారం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భగీరథ అరకొర.. తాగునీటికి కటకట



కొడంగల్‌ ప్లాంట్‌లో భగీరథ నీరు (ఫైల్‌)

నీటి కష్టాలు

- కొడంగల్‌లో రోజు విడిచి రోజు నీరు
- గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా
- ఎండాకాలంలో తప్పని తిప్పలు

కొడంగల్‌ : గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భగీరథ నీరు అరకొరగా సరఫరా చేస్తుండటమే ఇందుకు కారణం. మిషన్‌ భగీరథ పథకం ద్వారా నియోజకవర్గంలో ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేసేవారు. ఈ పథకం ద్వారా చాలా గ్రామాల్లో దాహార్తి తీరింది. తాగునీటి సమస్యలు పరిష్కారం అయ్యాయి. అయితే ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. శ్రీశైలం నుంచి వచ్చే నీటి సామర్థ్యం తగ్గింది. దీంతో కనీసం కొడంగల్‌ మున్సిపల్‌ పరిధిలోని అన్ని గ్రామాలకు కూడా మంచినీటిని సరఫరా అందడంలేదు. కొడంగల్‌ పట్టణంలో తగినంత మోతాదులో నీటి సరఫరా కావడం లేదు. కొన్ని కాలనీలకు రోజు తప్పించి రోజు నీరు వదులుతున్నారు. మిషన్‌ భగీరథ ప్రారంభమైన కొత్తలో కొడంగల్‌లో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు రెండు గంటల పాటు నీరు వదిలేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గంట కూడా సరిగ్గా రావడం లేదని మహిళలు వాపోతున్నారు. కొన్ని కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పాత కొడంగల్‌, పాత కొడంగల్‌ తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్‌ గ్రామాల్లో స్థానికంగా ఉన్న బోరు మోటార్లు ఆదుకుంటున్నాయి. ఈ బోరు మోటార్లతోనే గ్రామస్తుల దాహార్తి తీరుస్తున్నారు. ఐనన్‌పల్లి గ్రామంలో మాత్రం ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నారు. శుద్ధమైన తాగునీటిని అందించాలనే స్థానికులు కోరుతున్నారు.

సుదూరం నుంచి వస్తున్న కృష్ణమ్మ

శ్రీశైలం నుంచి కొడంగల్‌కు నీటి సరఫరా జరుగుతుందంటే మొదట్లో ఎవరూ నమ్మలేదు. 283 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణా నది నుంచి మిషన్‌ భగీరథ పథకంలో కొడంగల్‌కు నీటిని తరలిస్తున్నారు. పట్టణ శివారులోని సిద్ధనొంపు సమీపంలో ఉన్న వాటర్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌ (డబ్ల్యూటీపీ) కొడంగల్‌ ప్లాంట్‌లో ఎగిసి పడుతున్న నీరు (ఫైల్‌) నుంచి గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్‌ ట్యాంకులకు నీటిని పంపింగ్‌ చేసి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్‌ భగీరథ మేలు చేసిందని జనం మెచ్చుకున్నారు. అయితే ప్రస్తుతం ఏమి జరిగిందో కాని పూర్తి స్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. ప్రస్తుతం ఏప్రిల్‌ మాసం. వచ్చేది మే నెల. ఎండలు మరింత ముదిరే అవకాశం ఉంది. నీటి అవసరాలు పెరిగితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

నకిలీ ఐస్‌క్రీమ్‌ల తయారీ

- జిల్లాలోని తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు
- రూ.29 లక్షల విలువ గల సామగ్రి స్వాధీనం
- నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటాం
- ఎస్పీ కోటిరెడ్డి వెల్లడి

అనంతగిరి: హానికర రసాయనాలతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న కేంద్రాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడులు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఆయా పట్టణాల్లో ఐస్‌క్రీంల తయారీ కేంద్రాల్లో హానికరమైన రసాయనాలు ఉపయోగిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం టాస్క్‌ఫోర్స్‌ సీఐ వెంకటేశ్‌, ఎస్‌ఐ ప్రశాంత్‌వర్ధన్‌ తమ బృందంతో కలిసి వికారాబాద్‌, పరిగి, తాండూరు పట్టణాలలోని పలు ఐస్‌క్రీం తయారు చేసే కేంద్రాలపై ఏకకాలంలో దాడులు చేశారని తెలిపారు. వికారాబాద్‌లోని మణికంఠ, ఎస్‌కే ఐస్‌ క్రీం ఫ్యాక్టరీలు, పరిగిలోని దుర్గా, మహా, తాండూర్‌లోని సోనూగీత, రాయల్‌ ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. తయారీ కేంద్రాలకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు కూడా లేవన్నారు. వీటితో పాటు హానికరమైన రసాయనాన్ని హానికర ఫుడ్‌ కలర్స్‌, ఇతర ఫ్లేవర్స్‌ లభ్యమైనట్లు తెలిపారు. ప్రమాదకరమైన రసాయనాలతో ఐస్‌క్రీంలు తయారు చేస్తూ, విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. నకిలీ ఐస్‌క్రీములు తయారు చేస్తున్న నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో సుమారు రూ.29లక్షల విలువైన కల్తీ ఐస్‌క్రీంలను, వాటికి సంబంధించిన రసాయనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకట్రామయ్య, శీను, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సైట్‌ ఇంజినీర్‌

- రూ.5వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత
- మనబడి బిల్లులు చేయడానికి డబ్బు డిమాండ్‌
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు



ఏసీబీ అదుపులో సైట్‌ ఇంజనీర్‌ ఇర్ఫాన్‌ (కుడివైపు)

నవాబుపేట: లంచం తీసుకుంటూ సైట్‌ ఇంజినీర్‌ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన వికారాబాద్‌ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేసేందుకు విద్యా మౌలిక వసతుల కల్పన (టీఎస్‌ఈడబ్ల్యూటీసీ) శాఖలో సైట్‌ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఇర్ఫాన్‌ రూ. 5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. నవాబుపేట మండలం మాదారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసేందుకు రూ.7.80 లక్షల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టు పనులను అదే పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌ లావణ్య భర్త ముష్టు ప్రభుకు అప్పగించారు. రెండు నెలల క్రితమే మంజూరైన పనులను చేయగా మరికొన్ని పనులు మిగిలిపోయాయి. పనులన్నీ పూర్తి చేయాలని వాటికి సైతం బిల్లులు ఇస్తామని అధికారులు తెలపడంతో మంజూరైన నిధులకు అదనంగా రూ.3.50 లక్షలు వెచ్చించి పనులన్నీ పూర్తి చేశారు. ఈ క్రమంలో చేసిన పనులకు బిల్లులు చేయాలని ప్రభు అధికారుల చుట్టూ తిరిగాడు. పనులను తనిఖీ చేయడానికి వచ్చిన సైట్‌ ఇంజనీర్‌ ఇర్ఫాన్‌ బిల్లులు చేయడానికి లంచం డిమాండ్‌ చేశారు. ఇప్పటి వరకు ఇర్ఫాన్‌కు రూ.51వేలు లంచంగా ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం మళ్లీ మరో రూ.5వేలు ఇస్తేనే బిల్లులు వచ్చేలా చేస్తానన్నాడు. దీంతో ప్రభు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వికారాబాద్‌ పరిధిలో రూ.5వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా ఇర్ఫాన్‌ను పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని కార్యాలయంలోనూ సోదాలు చేశారు. ఈ మేరకు సైట్‌ ఇంజనీర్‌ ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు.

బంగారం తాకట్టుపెట్టి పనులు చేశా..



మన బడి కార్యక్రమంలో మంజూరైన నిధులతో పాటు అధికారులు చెప్పిన అన్నీ పనులు పూర్తి చేసి మూడు నెలలు అవుతుంది. ఇంకా రూ.3.50 లక్షల బిల్లులు రావాలి. అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి పనులు చేశాను. బిల్లులు చేయమంటే లంచాలు అడిగారు. అడిగినప్పుడల్లా డబ్బులు ఇచ్చాను. ఇప్పటికే రూ.51వేలు ఇచ్చాను. మళ్లీ అడగడంతో చేసేదిలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాను.

– కాంట్రాక్టర్‌ ప్రభు

జొన్నలు మరింత ప్రియం

- క్వింటాలు ధర రూ.5 వేలు
- సాగు తగ్గడమే కారణం
- కర్నాటక నుంచి దిగుమతి



తాండూరు మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.5వేలు

బషీరాబాద్‌: జొన్నలు మరింత ప్రియమయ్యాయి. మార్కెట్‌లో క్వింటాలు జొన్నల ధర రూ.5వేలు పలుకుతోంది. ఇందుకు కారణం జొన్నపంట సాగు క్రమంగా తగ్గుతుండటమే. పదేళ్ల కిందటి వరకు యాసంగిలో ఎక్కడ చూసినా జొన్నపంటలే దర్శనమిచ్చేవి. కానీ రైతులు వాణిజ్య పంటల వైపు చూడటంతో జొన్నపంటల సాగు గణనీయంగా తగ్గిపోతున్నాయి. దీంతో మార్కెట్‌లో జొన్నల ధరలకు రెక్కలు వచ్చాయి. తాండూరు ప్రాంతానికి పొరుగున ఉన్న కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మేలు రకం జొన్నలు పలుకుతున్నాయి. జిల్లాలో 5.9 లక్షల సాగు భూములు ఉండగా రైతులు వరి, కంది, పత్తి పంటలను ప్రధాన పంటలుగా సాగుచేస్తున్నారు. యాసంగిలో వరితో పాటు ఆరుతడి పంటలైన వేరుశనగ, జొన్నలు, కుసుమలు పండిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 1.8 లక్షల ఎకరాల భూముల్లో పంటలు సాగు అయ్యాయి. అయితే వీటిలో ఈ సారి తెల్లజొన్న, పచ్చజొన్న, సాయి జొన్న రకాలు కలిపి కేవలం 8,248 ఎకరాల్లోనే సాగు చేశారు. అంటే జిల్లాలోని సాగు భూముల్లో 1.5 శాతం మాత్రమే జొన్న పంటలు సాగుచేస్తున్నారు. ఒకప్పుడు ఏ గ్రామంలో చూసినా జొన్న పంటలే సాగు చేసేవారు. ప్రతీ రైతు ఇంటా బియ్యం కంటే జొన్నల సంచులే ఎక్కువగా కనిపించేవి. ఆరోగ్యానిచ్చే రొట్టెలు ప్రతీ ఒక్కరూ తినేవారు. అయితే అప్పట్లో జొన్నల ధరలు మార్కెట్‌లో తక్కువ ఉండడంతో రైతులు క్రమంగా వాణిజ్య పంటలవైపు మళ్లడంతో జొన్న పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. వెరసి పల్లెలోనూ జొన్నరొట్టెలను కొనుక్కొని తినే పరిస్థితి నెలకొంది.

అందని గౌరవం.. శ్రమదోపిడే నిత్యం

- అరకొర వేతనాలతో వీఓఏల బతుకులు దుర్భరం
- సమస్యలు పరిష్కరించాలని ఆందోళన బాట
- జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌



డిమాండ్లు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు (ఫైల్‌)

దౌల్తాబాద్‌: గౌరవ వేతనాలు పెంచక, సకాలంలో అందక ఐకేపీ విలేజ్‌ ఆర్గనైజేషన్‌ అసిస్టెంట్ల (వీఓఏ) బతుకులు దుర్భరంగా మారాయి. పనిభారంతో సతమతమవుతున్నా సహనంతో సేవలందిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. డ్వాక్రా సంఘాలు ఏర్పడిన తొలినాళ్ల నుంచి నేటికీ వేతనాలు పెంచలేదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనం చెల్లించాలని సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని వీవోఏలు ఆందోళన బాటపట్టారు.

సమన్వయంలో కీలకం

స్వయం సహాయక సంఘాలను క్షేత్రస్థాయిలో సమన్వయం చేయడంలో వీవోఏల పాత్ర కీలకం. సభ్యుల్లో క్రియాశీలకంగా ఉన్న ఒకరిని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగిస్తారు. పొదుపు సంఘాల్లో పని చేసే వీఓఏలకు ప్రతి నెలా గౌరవ వేతనం తక్కువగా ఉంది. పొదుపు సంఘాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమస్యలు తీర్మానాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయడం, బ్యాంకు అధికారులతో మాట్లాడి పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడం వీవోఏలు నిర్వహిస్తుంటారు. కొత్త సంఘాల ఏర్పాటు, చిన్న సంఘాల బుక్స్‌ రాయడం సమావేశాలు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం, బ్యాంకు, స్త్రీనిధి రుణాల మంజూరు, మొబైల్‌ డాటా ఎంట్రీ, సభ్యుల ఆధార్‌కార్డు బ్యాంక్‌ అకౌంట్లను సరిచేయడం, సేంద్రియ, సుస్థిర వ్యవసాయం, జాబ్‌మేళాల్లో ఉపాధి కల్పించడం తదితర విధులను నిర్వర్తిస్తున్నారు. ఇంత కష్టపడుతున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని వీవోఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టార్గెట్‌ చేరుకుంటేనే జీతం..

పొదుపు సంఘాలకు సంబంధించిన పనులు, పుస్తకాలు రాయడం, మినిట్స్‌ బుక్స్‌, వేతిముద్రలు తీసుకోవడం, ఆన్‌లైన్‌వర్క్‌, అప్‌లోడ్‌ చేయడం ఇలా అదనపు పనిభారాన్ని వీఓఏలపై మోపుతున్నారు. నయాపైసా ఇవ్వకుండా ఏళ్లుగా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైపెచ్చు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేసిన వారికి మాత్రమే జీతాలు, మిగతా వారికి నిరాశే ఎదురవుతుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ అభివృద్ధి పనుల్లో వీరి సేవలను అధికారులు వినియోగించుకుంటున్నారు.

రూ.3,900 గౌరవ వేతనం

జిల్లాలో మొత్తం 450 మంది వీవోఏలు ఉన్నారు. అయితే ఇందులో వందశాతం ఆన్‌లైన్‌ వర్క్‌ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నెలకు కేవలం రూ.3,900 గౌరవవేతనం చెల్లిస్తుంది. పేదరికంలో ఉన్న మహిళలను 20 ఏళ్లుగా పోగుచేసి సంఘాలు ఏర్పాటు చేసినా ఐకేపీ వీవోఏలకు ప్రభుత్వం గౌరవవేతనం సక్రమంగా చెల్లించడంలేదని ఆరోపిస్తున్నారు. ఉద్యోగభద్రత కల్పించాలని వేతనాలు పెంచాలని డిమాండ్‌ చేస్తున్నారు.

డిమాండ్లు ఇవి..

- సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించాలి.
- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- రూ.10లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలి
- ఆన్‌లైన్‌ పనులు రద్దుతో పాటు సెర్ప్‌ నుంచి ఐడీ కార్డు ఇవ్వాలి.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలి



నిత్యం స్వయం సంఘాల మహిళల బలోపేతానికి కషి చేస్తున్నాం. మహిళలకు రుణాలు ఇప్పించడంతో పాటు పొదుపుపై అవగాహన కల్పించి వాటిని చెల్లించేలా చర్యలు చేపడుతున్నాం. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. కనీస వేతనాలు చెల్లించి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలి.

– గోపాల్‌గౌడ్‌, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌

సమస్యాత్మక, సున్నితమైన ప్రదేశాలలో గస్తీ నిర్వహించడం కోసం ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌ జిల్లాకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులు ఎస్పీ కోటిరెడ్డిని కలిసి రిపోర్టు చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలలో కవాతు చేపట్టనున్నారు.

– అనంతగిరి



ఎస్పీతో సమావేశమైన ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌ అధికారులు

నేడు చేవెళ్లకు హోంమంత్రి రాక



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌

చేవెళ్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ భవనాన్ని బుధవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ ప్రారంభించనున్నట్లు చేవెళ్ల సీఐ జే వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో దాదాపు కోటి రూపాయలు వెచ్చించి ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ కోసం భవనాన్ని నిర్మించారు. ఉదయం 9గంటలకు జరగనున్న భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో హోం మంత్రి తోపాటు జిల్లా మంత్రి సబితా రెడ్డి,చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి,ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి,సురభివాణి దేవి,ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీజీపీ అంజనీకుమార్‌, సైబరాబాద్‌ సీపీ స్టీఫెన్‌ రవీంద్ర హాజరుకానున్నట్లు సీఐ తెలిపారు.

వంతెనలపై ఊడిన రేలింగ్‌

- కరువైన మరమ్మతు పనులు
- పట్టించుకోని అధికారులు



అన్నాసాగర్‌ బ్రిడ్జి పై కూలిన రేలింగ్‌

బంట్వారం: అధికారుల నిర్లక్ష్యం వల్ల వంతెనలపై ఊడిన రేలింగ్‌లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కోట్‌పల్లి మండల కేంద్రంలోని వాగు పై దాదాపు 40 ఏళ్ల కిందట బ్రిడ్జి నిర్మించారు. అదే సమయంలో అన్నాసాగర్‌ వాగు పైనా వంతెన కట్టారు. రెండు బ్రిడ్జిలకు ఇరు వైపులా అప్పట్లో వేసిన సైడ్‌ రేలింగ్‌ ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎక్కడికక్కడా ఊడి పోతున్నాయి. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం కనీస మరమ్మతులు చేపట్టడంలేదు.

అదుపు తప్పితే ప్రమాదమే

తాండూరు–సదాశివపేట రోడ్డు కావడంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. సిమెంటు, నాప రాయి లోడింగ్‌ వాహనాలు వందల సంఖ్యలో వెళ్తుంటాయి. కోట్‌పల్లి ప్రాజెక్టుకువెళ్లే టూరిస్టులు ఇదే దారిలో ప్రయాణిస్తుంటారు. వాహనాలు అదుపు తప్పితే రక్షణగా నిలిచేందుకే ఇరు వైపులా సైడ్‌ రేలింగ్‌ నిర్మిస్తారు. కోట్‌పల్లి, అన్నాసాగర్‌ బ్రిడ్జిలు సైడ్‌ వాల్స్‌ కూలుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు అటుగా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. వంతెనల వద్ద అదుపు తప్పితే వాగులో పడటం ఖాయమని భయాందోళన చెందుతున్నారు. సైడ్‌ వాల్స్‌ అధ్వాన స్థితికి చేరినప్పటికీ రోడ్లు, భవనాల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు.

కొత్తగా రేలింగ్‌ నిర్మిస్తాం

కోట్‌పల్లి, అన్నాసాగర్‌ వంతెనలపై కొత్తగా రేలింగ్‌ నిర్మిస్తాం. వీటికి సంబంధించి రూ. 50 లక్షలకు ఎస్టిమేషన్‌ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

– శ్రీనివాస్‌ డీఈ ఆర్‌అండ్‌బీ

రెండో రోజూ కేంద్ర బృందం సందర్శన



మాతా శిశు ఆస్పత్రిలో కేంద్ర బృందం సభ్యులు

తాండూరు టౌన్‌: పట్టణంలోని మాతా శిశు ఆస్పత్రిని రెండో రోజూ కేంద్ర బృందం సందర్శించింది. నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులు, పిల్లలకు అందుతున్న వైద్య సేవలపై కేంద్ర బృంద సభ్యులు డాక్టర్‌ మౌనికా రాణా, డాక్టర్‌ నివేదిత స్థానిక మాతా శిశు ఆస్పత్రిలో తనిఖీలు కొనసాగించారు. సోమవారం రికార్డులను పరిశీలించిన సభ్యులు మంగళవారం మెటర్నిటీ వార్డులు, ఆపరేషన్‌ థియేటర్‌, ఓపీ, పిల్లల వార్డులు, ఎస్‌ఎన్‌సీయూ, లేబరేటరీలను తనిఖీ చేశారు. అయితే లక్ష్య, ముస్కాన్‌ పథకంలో భాగంగా 70 శాతం పైగా ఉత్తమ సేవలందించిన ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్‌ జారీ చేసి, ఐదేళ్ల పాటు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయనున్నారు. అయితే తనిఖీలు చేసిన కేంద్ర బృంద సభ్యులు మీడియాకు వివరాలు చెప్పేందుకు విముఖత చూపారు. ఆస్పత్రిని క్షుణ్ణంగా పరిశీలించిన బృంద సభ్యులు వైద్య సేవలపై పెదవి విరిచినట్లు సమాచారం. కాగా పలు విభాగాల్లో సిబ్బంది చేయాల్సిన విధుల పట్ల పలు సలహాలు, సూచనలు చేశారు. సభ్యులు నేరుగా నివేదికను నేషనల్‌ హెల్త్‌ మిషన్‌కు చేరవేయనున్నట్లు తెలిసింది.